సాక్షి అన్నమయ్య జిల్లా

శుక్రవారం । 18 । జూలై । 2025



అంకెలు రాస్తే..డబ్బులా..!!

అంకెలు రాస్తే.. డబ్బులిస్తామని మహిళలను మోసగించిన ఎలైట్ గ్రూప్ డేటా నిర్వాహకుడిపై పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారు. -8లో



అమూల్ డెయిరీ స్థలంలో రియల్ ఎస్టేట్ బోర్డులు

మదనపల్లె అమూల్ డెయిరీ స్థలంలో ఓ రియల్టర్ తన వెంచర్‌కు సంబంధించిన బోర్డులు శాశ్వతంగా ఏర్పాటుచేశాడు. -8లో

మదనపల్లి: టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.250	రూ.320
రెండోరకం	రూ.180	రూ.240



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు: 870 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
సీబీ	600	600
బైవోల్టిన్	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 54.560 కిలోలు

న్యూస్‌రీల్

నాలుగు ఏఎంసీలకు చైర్మన్ల నియామకం

సాక్షి రాయచోటి: అన్నమయ్య జిల్లాతో పాటు వైఎస్ఆర్ కడప జిల్లాలోని పలు మార్కెట్ యార్డ్ కమిటీలకు కూటమి సర్కార్ చైర్మన్ లను నియమించింది.. మదనపల్లె మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని జనసేన పార్టీకి కేటాయించగా బద్వేలు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవిని బీజేపీకి కేటాయించారు.. వైఎస్ఆర్ కడప జిల్లా బద్వేలు మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా పి.విజయలక్ష్మి(బీజేపీ) , అన్నమయ్య జిల్లా రాయచోటి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా బోడిరెడ్డి రాంప్రసాద్ రెడ్డి (టీడీపీ), అదే నియోజకవర్గంలో ఉన్న లక్కిరెడ్డిపల్లి మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ఎస్ ఎండి షఫీ, మదనపల్లె మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా జంగాల శ్రీనివాస్(జనసేన)ను నియమించారు.. అందుకు సంబంధించి కూటమి ప్రభుత్వం పదవులకు సంబంధించి పేర్లు ప్రకటించింది.. అధికారికంగా ఆదేశాలు రావాల్సి ఉంది

గెస్ట్ ఫ్యాకల్టీ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

రాజంపేట టౌన్: రాజంపేట పట్టణంలోని ఉర్దూ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఎకనామిక్స్ అధ్యాపక పోస్టుకు గెస్ట్‌ఫ్యాకల్టీగా పనిచేసుకునేందుకు ఈనెల 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సునీల్ బర్నబాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 50 శాతం మార్కులతో ఎంఏ (ఎకనామిక్స్) ఉత్తీర్ణులై, డిగ్రీలో ఉర్దూ మీడియం చదివిన వారు లేక డిగ్రీలో ఉర్దూ లాంగ్వేజ్ సబ్జెక్టు చదివి ఉండాలన్నారు. ఆసక్తికలిగి, అర్హులైన వారు ఈనెల 21వ తేదీలోపు తమ దరఖాస్తును కళాశాలలోని కార్యాలయ పనివేళల్లో అందచేయాలన్నారు.ఈనెల 23వ తేదీ ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. అభ్యర్థులు తమ వెంట విద్యార్హతకు సంబంధించి ఒరిజినల్, జిరాక్స్ కాపీలను తీసుకురావాలన్నారు. రాష్ట్రంలోని ఏ ప్రాంతంలోని వారైనా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

బాలిక హత్యపై స్పందించిన కమిషన్

కడప కోటిరెడ్డి సర్కిల్: గండికోటలో హత్యకు గురైన ఇంటర్ విద్యార్థిని సంఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ స్పందించింది. ప్రొద్దుటూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న వైష్ణవి ఇంటి నుంచి బయలుదేరి, ఆ తర్వాతకు హత్యకు గురైందని పత్రికల్లో వార్తలు ప్రచురితం కావడంతో కమిషన్ సుమోటోగా స్వీకరించింది. ఇంటర్ విద్యార్థిని చనిపోవడం బాధాకరమని, వారి తల్లిదండ్రులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నామని పేర్కొంది. ఎన్ని గంటలకు వెళ్లింది, ఎక్కడి నుంచి వెళ్లింది, సంఘటన జరగడానికి కారణాలు తదితరాలపై సమగ్ర విచారణ చేసి నివేదిక సమర్పించాలని జిల్లా పోలీసు అధికారులు, సంబంధిత అధికారులను కమిషన్ ఆదేశించింది.

రేపటి నుంచి తపాలా సేవలకు అంతరాయం

రాజంపేట టౌన్: తపాలా కార్యాలయంలో ఈనెల 19 నుంచి 22వ తేదీ వరకు అన్ని రకాల సేవలు సేవలను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు రాజంపేట హెడ్ పోస్టుమాస్టర్ షేక్ హబీబుల్లా తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించేందుకు తపాలాశాఖను ఆధునీకీకరిస్తున్నారన్నారు. ఈకారణంగా డేటా ట్రాన్స్‌ఫర్, సాంకేతిక మరమ్మతు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈకారణంగా నాలుగు రోజుల పాటు తపాలా కార్యాలయాల్లో ఎలాంటి లావాదేవీలు ఉండవన్నారు. సాంకేతిక మరమ్మతులు పూర్తయితే 2.0 సాంకేతికత అందుబాటులోకి వస్తుందని, ఫలితంగా ఖాతాదారులకు అన్ని రకాల సేవలు వేగవంతం అవుతాయన్నారు. దీనివల్ల ఖాతాదారులకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. సెల్‌ఫోన్ ద్వారానే ఆర్థిక, బీమా, బ్యాంకింగ్ తదితర సేవలు అతి తక్కువ సమయంలో పూర్తవుతాయని తెలిపారు.

పాఠశాలల ఆకస్మిక తనిఖీ




వర్క్‌బుక్కును పరిశీలిస్తున్న డీఈఓ సుబ్రమణ్యం

సుండుపల్లె: మండల పరిధిలోని వెంగమరాజుపల్లె, గుల్లవాండ్లపల్లె, సుండుపల్లె మండల పరిషత్ ప్రాథమిక..ఆదర్శ పాఠశాలలను గురువారం జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రమణ్యం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలల పరిసరాలను పరిశీలించారు.అనంతరం మాట్లాడుతూ విద్యార్థుల్లో భాషా నైపుణ్య అభివృద్ధి లక్ష్యంగా బోధన సాగించాలని, నూతన మార్పులకు అనుగుణంగా పిల్లల్లో సామర్థ్యాలను పెంపొందేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని చెప్పారు.సుండుపల్లె ఎంపీపీఎస్‌లో ఉపాధ్యాయుల కొరత ఉందని జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి ఉపాధ్యాయుడు రవీంద్రనాథ్‌రెడ్డి తీసుకెళ్లగా ఒకరిని కేటాయించారు. అనంతరం పిల్లల వర్క్ బుక్కులను డీఈఓ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈఓలు వెంకటేష్ నాయక్, రవీంద్రనాయక్ పాల్గొన్నారు.

చినుకులేక చింత



- జూలై 15 దాటినా కనిపించని వర్షాలు
- ఖరీఫ్ సీజన్లో విత్తనసాగుకు సన్నద్ధమైన రైతులు
- వర్షం కోసం అన్నదాతల ఎదురుచూపు



సాక్షి, రాయచోటి: ఖరీఫ్ కష్టకాలం కనిపిస్తోంది.. పంటలు వేసేందుకు పరిస్థితులు అనుకూలంగా లేవు... కరువు ఛాయలు కళ్లెదుటే కనిపిస్తున్నాయి..జులై 15 దాటినా పంట సాగు కాని పరిస్థితి చూస్తే కళ్లెదుటే ఖరీఫ్ కథ ముగిసేలా ఉంది. గత ఏడాది జిల్లాలో ఈ వర్షాధారం కింద సుమారు లక్ష ఎకరాలకు పైగా సాగు కావాలని వ్యవసాయ శాఖ సాధారణ లక్ష్యంగా నిర్ణయిస్తున్నా.. అనుకున్న మేర సాగు కనిపించడం లేదు.. గతేడాది లాగే ఈ సారి కూడా ఖరీఫ్ ఆశాజనకంగా కనిపించడం లేదు.జిల్లాలో ఖరీఫ్ సాగుకు సంబంధించి వేరుశనగ, కంది, వరి, ఉలవలు ఇలా అనేక రకాల పంటలను వర్షాధారం కింద సాగు చేస్తారు. జూన్ మొదటి నుంచి జులై 15 లోపు వర్షాధారం కింద మంచి అదునుగా భావిస్తారు. అయితే ఈ సారి ఇప్పటికి పదునైన వర్షం లేకపోగా అరకొర వర్షాలకు అంతంత మాత్రంగా పదుల సంఖ్యలో సాగైన పంట కూడా ఎండిపోతోంది. వేరుశనగకైతే జులై 15లోపు మంచి అదునును వ్యవసాయ శాఖ అధికారులు కూడా చెబుతున్నారు. ఇప్పటికీ అదును జాడ లేకపోవడంతో ఇక తరువాత వర్షాలు పడినా లేటు అదును కింద సాగు చేయాల్సిందే. అయితే ఇప్పటికప్పుడు వర్షాల జాడ కూడా కనిపించకపోవడం ఖరీఫ్ రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.

వర్షం కోసం ఎదురుచూపులు


జిల్లాలో ఖరీఫ్‌లో రైతులు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. గత ఏడాది కూడా అనుకున్న మేర వర్షాలు లేక పంటలు నిలువునా ఎండిపోయాయి. ఈసారి కూడా వర్షపు జాడ కనపడకపోవడంతో మరో మారు కరువు ఛాయలు కనిపిస్తున్నాయి. ప్రతిసారి ప్రకతి కనిపించకపోవడంతో అన్నదాత ఆందోళన చెందుతున్నాడు. ఇప్పటి వరకు వేరుశనగ, వరి, కంది తక్కువ ఎకరాలలో సాగయ్యాయి. ఈ ఖరీఫ్‌లో అన్నదాతలు వర్షం కోసం ఎదురుచూస్తున్నారు.



సంబేపల్లె ప్రాంతంలో పంటలు సాగు చేసేందుకు సిద్ధం చేసిన భూమి



జిల్లాలో ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం: 57,003 హెక్టార్లు	వేరుశనగ	వరి సాధారణ	మొక్కజొన్న	కందులు
	సాగు అంచనా: 38,013 హెక్టార్లు	సాగు: 11,432 హెక్టార్లు	సాధారణ సాగు: 1,911 హెక్టార్లు	సాధారణ సాగు: 2,404 హెక్టార్లు
	సాగైన వేరుశనగ: 1,840 హెక్టార్లు	సాగైంది: 537 హెక్టార్లు	సాగైంది: 543 హెకార్టు	ఇప్పటి వరకు సాగైంది: 89 హెక్టార్లు



అందని సాయం

జిల్లాలో ఖరీఫ్ పంటలకు సంబంధించి పెట్టుబడి సాయం కింద గతంలో వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం మే నెలలోనే రైతులకు రైతు భరోసా నిధులను అందించేది. తద్వారా పంటలు సాగు చేసేందుకు సులువుగా ఉండేది. ఎంతో కొంత పెట్టుబడి సొమ్ములు ఉండటంతో పంటలను సాగు చేసేవారు. అయితే 2024లో కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినా ఇప్పటి వరకు అన్నదాత సుఖీభవ నిధులు విడుదల చేయలేదు. ఒకవైపు ఖరీఫ్.. వర్షం లేక మట్టి కొట్టుకుపోతుండగా మరోవైపు అన్నదాత సుఖీభవ నిధులు కూడా ప్రభుత్వం అందించకపోవడంతో రైతన్నలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కష్టకాలంలో ఉన్న రైతన్నను ఆదుకోవాల్సిన ప్రభుత్వం కనీసం ఇప్పటి వరకు నిధులు విడుదల చేయకపోవడంతో పెదవి విరుస్తున్నారు.

వర్షపాతం వివరాలు

2024 జూన్‌లో 160.6 మిల్లీమీటర్లు, జూలైలో 47.5, ఆగస్టు 99.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 2025 జూన్‌లో 75.1 మిల్లీమీటర్ల వర్షం కురవాల్సి ఉండగా 24.8 మి.మీ కురిసింది. జూలైలో 90.5 మిల్లీమీటర్ల వర్షం కురువాలి.అయితే 2.3 మిల్లీమీటర్లు మాత్రమే కురసింది.

వర్షం కోసం ఎదురుచూపు



నాకు 2 ఎకరాల పొలం ఉంది. మొదట వేరుశనగ అనుకున్నా.. అదును దాటిపోయింది కాబట్టి ప్రత్యామ్నాయ పంటలు సాగు చే యాలన్న ఆలోచనలోఉన్నాం. ఎప్పుడెప్పుడు వర్షం పడుతుందా అని ఎదురుచూస్తున్నాం.
– గయాజ్‌బాషా, రైతు, గుర్రంకొండ మండలం

వేరుశనగ విత్తే పరిస్థితి లేదు..



వరుణ దేవుడు కరుణించక వేరుశనగ విత్తే పరిస్థితి కనిపించడం లేదు. మే నెలలో కురిసిన వర్షానికి దుక్కులు చేసి పెట్టుకున్నా.జూన్‌నుంచి ఇప్పటి వరకు చినుకు జాడ లేదు. కంది సాగయ్యే పరిస్థితులు లేవు. -పాలేపల్లి మోహన్ రెడ్డి(రైతు), మర్రిచెట్టు, లక్కిరెడ్డిపల్లె మండలం

అదునుదాటుతున్నా..



ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల రోజులైంది. అదును దాటుతున్నా అనుకున్న మేర వర్షం పడలేదు. ఇప్పటికే దుక్కులు దున్నాం. వర్షం కోసం ఎదురుచూస్తున్నాం. చినుకులు రాలితే విత్తనాలు వేయడానికి సిద్ధంగా ఉన్నాం.
–నాగేశ్వర, రైతు,మల్లూరు,చిన్నమండెం మండలం

స్వచ్ఛ సర్వేక్షణ్‌లో కేఎంసీకి మూడో ర్యాంకు

కడప కార్పొరేషన్: స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో కడప మున్సిపల్ కార్పొరేషన్(కేఎంసీ)కు రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు లభించింది. జాతీయ స్థాయిలో 31వ ర్యాంకు వచ్చింది. 2019 నుంచి స్వచ్ఛ సర్వేక్షణ్ కింద ఇచ్చిన ర్యాంకుల్లో ఇదే అత్యుత్తమం కావడం గమనార్హం. 2019లో జాతీయ స్థాయిలో 62వ ర్యాంకు రాగా, 202లో 54, 2021లో 56, 2022లో 56, 2023లో 58వ ర్యాంకులు లభించాయి. 2024 సంవత్సరంలో నిర్వహించిన సర్వేల్లో కడపకు అతి తక్కువగా 31వ ర్యాంకు లభించింది. చెత్తను తడి, పొడి చెత్తలుగా విడదీయడంలో 48 శాతం, ఆ చెత్తలు ప్రాసెసింగ్ చేయడంలో 98 శాతం మార్కులు లభించాయి. గత ఏడాది జీఎఫ్‌సీ స్టేటస్‌లో త్రీస్టార్ రాగా, ఈ ఏడాది సింగిల్ స్టార్ వచ్చింది. బహిరంగ మల, మూత్ర విసర్జన చేయకపోవడం వల్ల ఓడీఎఫ్(ఓపెన్ డెఫికేషన్ ఫ్రీ) ప్లస్, ప్లస్ స్టేటస్ వచ్చింది. విజయవాడ, తిరుపతి, గుంటూరు, విశాఖపట్నం, రాజమండ్రి నగరాల తర్వాత స్వచ్ఛసర్వేక్షణ్‌లో అన్ని విభాగాల్లో కడపకే ఎక్కువ మార్కులు పడ్డాయని చెప్పవచ్చు.

తిరుపతి- చర్లపల్లి మధ్య ప్రత్యేక రైలు

కడప కోటిరెడ్డి సర్కిల్: ఆగస్టులో తిరుపతి–చర్లపల్లి మధ్య మరో ప్రత్యేక రైలు నడపనున్నట్టు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. ప్రతి ఆదివారం, సోమవారం ఈ రైలు రాకపోకలు సాగిస్తుందని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. తిరుపతిలో ఆగస్టు 3, 10, 17, 24వ తేదీల్లో (ఆదివారం) 07481 రైలు 9.10 గంటలకు బయలుదేరుతుందని ఆయన పేర్కొన్నారు. రేణిగుంట, రాజంపేట, కడప, ఎర్రగుంట్ల, తాడిపత్రి, గుత్తి, డోన్, కర్నూలు సిటీ, గద్వాల్, వనపర్తి రోడ్డు, మహబూబ్ నగర్, జడ్చర్ల, కాచిగూడ, మల్కాజ్‌గిరి మీదుగా చర్లపల్లికి వెళ్తుందన్నారు. ప్రతి సోమవారం చర్లపల్లిలో రాత్రి 7.20 గంటలకు బయలుదేరి.. మంగళవారం ఉదయం 9.30 గంటలకు తిరుపతికి చేరుకుంటుందన్నారు. ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రైల్వే అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన తెలిపారు.

◆ వినూత్న ప్రయోగం



అయ్యవారిపల్లి వద్ద డ్రై వరి పద్ధతిలో నాట్లు వేస్తున్న మహిళలు

రాష్ట్ర కమ్యూనిటీ నాచురల్ ఫార్మింగ్(ఏపీసీఎన్ఎఫ్) ఆధ్వర్యంలో వాల్మీకిపురం మండలంలోని అయ్యవారిపల్లిలో డ్రై వరి సాగును ఏపీసీఎన్ఎఫ్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు వెంకటమోహన్ ప్రారంభించారు. అయ్యవారిపల్లికి చెందిన ఏపీసీఎన్ఎఫ్ క్లస్టర్ ఇన్‌చార్జి స్వాతి పొలంలో 20 సెంట్ల విస్తీర్ణంలో డ్రైవరి, అందులోనే మిశ్రమ పంటలుగా టమాటా, మిరప, ఉల్లి, బంతిపూలు, మొక్కజొన్న, ఆముదం, ముల్లంగి, బీర, కాకర, కీర, పాలకుర, సొరకాయ, దనియాలు, మెంతులు, అలసంద వంటి 21 రకాల విత్తనాలను నాటారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ డ్రై వరి పద్ధతి ద్వారా తక్కువ నీటితో ఎక్కువ పంట దిగుబడి సాధించవచ్చన్నారు. నాలుగు అడుగులు వెడల్పుతో బెడ్‌లు, ఒక్క అడుగు వెడల్పుతో కాలువలు ఏర్పాటు చేయడంతో అంతరపంటలు సాగు చేసుకోవడానికి వీలుంటుదని తెలిపారు. డ్రైవరి సాగుతో భూమిలో తేమ నిల్వ ఉండటంతో పాటు జీవసారం పెరుగుతుందని, వ్యవసాయ ఖర్చులు తగ్గి ఆరోగ్యకరమైన ఆహార ఉత్పత్తులు పొందవచ్చని చెప్పారు. ఐసీఆర్‌పీఎస్ ప్రతినిధులు పంటల మిశ్రమం, బయో మల్చింగ్, ప్రకృతి వ్యవసాయ సూత్రాలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ సుబ్బరామయ్య,హెచ్ఎన్ఎఫ్ సాహితి పాల్గొన్నారు.

–కలికిరి(వాల్మీకిపురం)

రోగులతో స్నేహంగా మెలగాలి

- వైద్య సిబ్బంది సేవా దృక్పథంతో విధులు నిర్వహించాలి
- జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

కురబలకోట: జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల పట్ల సిబ్బంది మర్యాద పూర్వకంగా, స్నేహంగా మెలగాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. గురువారం కురబలకోట ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రి నిర్వహణ, పరిశుభ్రత, రోగులకు అందుతున్న సేవలు, మందుల పరిస్థితి, సిబ్బంది కొరత, ఓపీ వివరాలు, రక్త పరీక్షలు, సిబ్బంది పనితీరు తదితర వాటిపై డాక్టర్ చక్రవర్తిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలన్నారు. అవసరమైన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రంలోని సిబ్బంది స్నేహ పూర్వకంగా మెలిగారా లేదా వంటి అంశాలపై ముఖ్యమంత్రి కార్యాలయం ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరిస్తోందన్నారు. సేవా దృక్పథంతో విధులు నిర్వహించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాల మేరకు పీహెచ్‌సీలు పనిచేయాలన్నారు. 15 రోజులకోసారి తహసీల్దార్, ఎంపీడీఓ పీహెచ్‌సీలను తనిఖీ చేయాలన్నారు. సమస్యలు ఉంటే పరిష్కరించాలన్నారు. అనంతరం ఆయన కురబలకోటలోని సంపద సృష్టి (డంపింగ్ యార్డు) కేంద్రాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ధనుంజయలు, ఎంపీడీఓ గంగయ్య తదితరులు పాల్గొన్నారు.



కురబలకోట పీహెచ్‌సీ తనిఖీలో సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్

నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు చర్యలు

రాయచోటి: జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు అవసరమైన భూమి కేటాయింపు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో పి–4 పాజిటివ్ పీపుల్ పర్సెప్షన్, ఎంఎస్ఎంఈ పార్కులు, ప్రధాన మంత్రి ఆదర్శ గ్రామ యోజన, స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర తదితర అంశాలపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ శ్రీధర్, జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పి–4 కార్యక్రమంలో ఆగస్టు 15 నాటికి 15 లక్షల బంగారు కుటుంబాలను మార్గదర్శకాలతో మ్యాప్ చేసే ప్రక్రియ జరుగుతోందన్నారు. జిల్లాలో గుర్తించిన బంగారు కుటుంబాలను మార్గదర్శులతో మ్యాప్ చేసే ప్రక్రియను త్వరగా పూర్తిచేయాలన్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో ఆరు ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు భూమి అవసరమైన నియోజకవర్గాల్లో భూమి కేటాయింపు జరగాలని తెలిపారు. ప్రపంచ బ్యాంకు చేయూతతో నిర్వహిస్తున్న ర్యాంప్ ప్రాజెక్టులో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామ యోజన కార్యక్రమంలో పెండింగ్ ప్రాజెక్టులపై చర్యలు తీసుకోవాలని సాంఘిక సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. ప్రతి నెల మూడో శనివారం జరిగే స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల మూడో శనివారం ప్లాస్టిక్ కాలుష్యాన్ని అంతం చేయడం అనే ఇతివృత్తంతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, దీనికి అధికారులు అందరూ సిద్ధంగా ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డీఆర్ఓ మధుసూదన రావు తదితరులు పాల్గొన్నారు.

దగాకోర్ కటింగ్

- హంద్రీ–నీవా రెండో దశ లైనింగ్ పనుల్లో మరో లోపం
- రూ.162 కోట్లు ఇచ్చేశాక తీరిగ్గా నాణ్యత పరీక్షలకు కోర్ కటింగ్
- పుంగనూరు, కుప్పం ఉపకాలువ లైనింగ్ పనుల్లో ఇష్టారాజ్యానికి నిదర్శనం
- నాణ్యత పరీక్షల తర్వాతే బిల్లులు ఇవ్వాలన్న నిబంధనకు తూట్లు





పుంగనూరు ఉపకాలువలో లైనింగ్ పనులు

మదనపల్లె: హంద్రీ–నీవా ప్రాజెక్టు రెండోదశలో భాగంగా పుంగనూరు (పీబీసీ), కుప్పం ఉప కాలువల్లో జరిగిన కాంక్రీటు లైనింగ్ పనుల్లో అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. తాజాగా నాణ్యత పరీక్షలు చేయకుండానే బిల్లులు చెల్లించేసిన వైనం బట్టబయలైంది. సాధారణంగా పనులు చేశాక వాటి కోర్ కటింగ్‌లు తీసి ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించాకే బిల్లులు చెల్లించాల్సి ఉంటుంది. అయితే పీబీసీ పనుల్లో ఈ నిబంధనకు నీళ్లొదిలినట్టు తెలుస్తోంది. కాంట్రాక్టు సంస్థకు రూ.కోట్ల బిల్లులు చెల్లించేశాక తీరిగ్గా కోర్ కటింగ్ చేపట్టి వాటి నాణ్యతను పరీక్షించే చర్యలను అధికారులు చేపట్టడం అందరినీ విస్మయానికి గురిచేస్తోంది. అన్నమయ్య జిల్లా పెద్దతిప్పసముద్రం మండలంలోని కిలోమీటర్ 74 నుంచి చిత్తూరుజిల్లా పెద్దపంజాణి మండలంలోని 207.800 కిలోమీటర్ వరకు పుంగనూరు ఉపకాలువ (పీబీసీ) పనులు రూ.480 కోట్లతో (అందులో పనికి రూ.366 కోట్లు), చిత్తూరుజిల్లా పెద్దపంజాణి మండలం నుంచి కుప్పం వరకు రూ.169 కోట్లతో 90 కిలోమీటర్ల కుప్పం ఉపకాలువలో లైనింగ్ పనులు చేపట్టిన విషయం తెలిసిందే.

రూ.162 కోట్లు చెల్లించేశారు

పుంగనూరు ఉపకాలువ పనులు ఇద్దరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల పర్యవేక్షణలో సాగుతున్నాయి. 117 కిలోమీటర్ల మేర కాలువ పనులకు సంబంధించి రూ.71 కోట్ల బిల్లులను చెల్లించేశారు. కుప్పం ఉపకాలువకు సంబంధించి ఒక ఈఈ పర్యవేక్షణలో పనులు చేస్తుండగా 90 కిలో మీటర్ల మేర లైనింగ్ పనికి సంబంధించి రూ.91 కోట్ల బిల్లులు చెల్లించారని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఈ బిల్లులను చెల్లించాలంటే ముందుగా కోర్ కటింగ్ జరిగి, అందులో నాలుగు ఇంచుల మందంతో కాంక్రీటు వేశారా లేదా, అందులో నాణ్యత ఉందా లేదా పరీక్షించాలి. అయితే ఇది చేయకుండా కాంట్రాక్టు సంస్థ ఏర్పాటు చేసిన క్యూబుల్లో నాణ్యత పరీక్షలు సొంతంగా నిర్వహించుకుని బిల్లులను చెల్లించినట్టు తెలుస్తోంది. బిల్లులు చెల్లించాక ఇప్పుడు కోర్ కటింగ్‌లు తీయడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

నాణ్యత ధ్రువీకరణ లేకుండానే బిల్లుల చెల్లింపు!



కుప్పం ఉపకాలువలో లైనింగ్ పనులు

ఏప్రిల్ నుంచి పుంగనూరు, కుప్పం ఉపకాలువల్లో కాంక్రీట్ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. పీబీసీ పనులపై మూడు నెలల్లో నాణ్యతపై కోర్ కటింగ్ తీయని అధికారులు గత వారంలో 200కి పైగా కోర్ కటింగ్‌లు తీశారని తెలిసింది. ఇంకా కొన్నిచోట్ల కటింగ్‌లు తీయాల్సి ఉందని సిబ్బంది చెబుతున్నారు. గతనెలలో కుప్పం పనులకు సంబంధించి 264 చోట్ల కోర్ కటింగ్ చేసి నాణ్యత పరిశీలన కోసం తిరుపతిలోని ఎన్ఏబీఎల్‌కు తరలించారు. వీటి నాణ్యత గ్రేడ్–15 అని వస్తేనే ఒప్పందం మేరకు పనులు సాగుతున్నట్టు లెక్క అని ప్రాజెక్టుకు చెందిన ఓ అధికారి చెప్పారు. ఇంతవరకు ఈ పనులకు సంబంధించి నాణ్యత ధ్రువీకరణ ఇంకా ఇవ్వలేదని క్వాలిటీ కంట్రోల్ అధికారి ఒకరు వెల్లడించారు. అంటే నాణ్యత ధ్రువీకరణ లేకుండానే అధికారులు గుడ్డిగా బిల్లులు చెల్లించారని స్పష్టం అవుతోంది.

పడిగాపులు



బాధ్యతలు చేపట్టేందుకు నిరీక్షిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ కస్తూరి

రాయచోటి టౌన్: ఆఫీసర్ ఎవరైనా బదిలీపై వెళితే.. అప్పటికే అక్కడ విధులు నిర్వహిస్తున్న అధికారి బాధ్యతలు అప్పగిస్తారు. ఇది సాధారణం...అది ఏ శాఖ అయినా జరిగేది ఇదే...అదేమి విచిత్రమో.. ఈ ప్రభుత్వంలో బదిలీపై వచ్చిన అధికారి కార్యాలయానికి వచ్చినా చార్జి అప్పగించేవారు లేక పడిగాపులు కాయాల్సిన పరిస్థితి. ఇదంతా ఎక్కడో జరగలేదు. అన్నమయ్య జిల్లా రాయచోటి వీరభద్ర స్వామి ఆలయంలో చోటు చేసుకొంది. శ్రీకాళహస్తి ఆలయ అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కస్తూరి రాయచోటి అసిస్టెంట్ కమిషనర్ హోదాలో బాధ్యతలు చేపట్టేందుకు గురువారం వచ్చారు. అయితే ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఈవో రమణారెడ్డి ఆలయంలో లేకపోవడంతో ఆయన రాక కోసం వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. ఈమె గతంలో దేవుడి కడప, బోయకొండమ్మ, కాణిపాక ఆలయాల్లో పని చేశారు. ఇప్పుడు రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి అసిస్టెంట్ కమిషనర్ హోదాలో వచ్చారు. బాధ్యతలు అప్పగించాల్సిన అధికారి లేకపోవడంతో ఎక్కడికి పోవాలో తెలియక, ఏమీ చేయాలో దిక్కుతోచక ఆలయంలో నిరీక్షిస్తూ ఉండాల్సి వచ్చిందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

క్లుప్తంగా

విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో చెలరేగుతున్న మంటలు

గాలివీడు : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. మండలంలోని గాలివీడు నాలుగు రోడ్ల కూడలిలో 108 కార్యాలయం వద్ద గురువారం 63 కేవీఏ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లో న్యూట్రల్ ప్లగ్ వైర్లు తెగిపడ్డాయి. ఆయిల్ లీకేజీ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్థానికులు విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అధికారులు పవర్ కట్‌చేసి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. పెద్ద ప్రమాదమే తప్పిందంటూ స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు.

వినూత్న నిరసన



రాజంపేట: నిరసన తెలుపుతున్న కార్మికులు

రాజంపేట : పట్టణంలోని మున్సిపల్ కార్మికులు గురువారం మోకాళ్లపై కూర్చుని నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నేత చిట్వేలి రవికుమార్, పీవీరమణ, లక్ష్మీదేవి, ప్రసాద్, సుధీర్, సాలమ్మ, వెంకటరమణ, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రబలిన విష జ్వరాలు



సిద్దవటం ఆస్పత్రిలో జ్వర పీడితులు

సిద్దవటం : మండలంలో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. పల్లెల్లో అపరిశుభ్రత, నీరు కలుషితం కావడమే ఇందుకు కారణం. మండలంలోని సిద్దవటం, జ్యోతి, వంతాటిపల్లె, బెటాలియన్ ప్రాంతాల్లో పలువురు విష జ్వరాల బారిన పడ్డారు. కొందరు సిద్దవటం ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం వైద్య సేవలకోసం తరలిరాగా, మరింత మంది కడపలోని ప్రైవేటు ఆసుపత్రులకు చికిత్స కోసం వెళ్లారు. మురుగు కాల్వలు, తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయడం లేదని, అధికారుల నిర్లక్ష్యంతోనే జ్వరాలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా వైద్య సిబ్బంది పర్యటించి రోగులకు సేవలందించాలని కోరుతున్నారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధుడు మృతి




మృతిచెందిన మారం సుబ్రహ్మణ్యం

నందలూరు : మండలంలోని ఎగువ కుమ్మరపల్లె గ్రామంలో గురువారం సాయంత్రం మారం సుబ్రహ్మణ్యం(64) విద్యుత్ షాక్‌తో గురువారం మృతిచెందారు. మృతుడి కుమారుడు మారం శంకరయ్య వివరాల మేరకు.. తన తండ్రి సాయంత్రం ఆరు గంటల సమయంలో బహిర్భూమికి వెళ్లి ఓ పొలం నీటి తొట్టి వద్ద విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురయ్యారు. ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు.

అంకెలు రాస్తే..డబ్బులా..!!



ఎలైట్ క్రాఫ్స్ మోసంపై విచారిస్తున్న రూరల్ సీఐ సత్యనారాయణ



డేటా ఫారంలో రాసిన అంకెలు

- ఎలైట్ క్రాఫ్స్ డేటాపై సమగ్ర విచారణ
- పరారీలో ఉన్న నిర్వాహకుడి కోసం వేట

కురబలకోట : అంకెలు రాస్తే.. డబ్బులా.. ఇదేమి టబ్బా.. ఆ రాతలను ఏం చేసుకుంటారు..ఇది వినడానికే ఆశ్చర్యంగా ఉంది. ఇలాంటి కొత్త తరహా మోసాలే ఇపుడు బయటపడుతున్నాయి. డేటా ఎంట్రీ, వర్క్ ఫ్రమ్ హోం పేర్లతో అన్నమయ్య జిల్లాలోని అంగళ్లులో ఎలైట్ క్రాఫ్స్ డేటా సొల్యూషన్స్ మోసాలపై బుధవారం వందలాది మహిళలు ఫిర్యాదు చేయడంతో ఈ విషయం వెలుగుచూసింది. ఇప్పటికే 600 మంది బాధితులను వివిధ ప్రాంతాల్లో బ్రాంచీలు ఏర్పాటుచేసి పేర్లు, చిరునామా మార్చి మోసం చేసినట్లు పోలీసుల విచారణలో వెల్లడవుతోంది. న్యాయం కోసం అంగళ్లు ఓపీ స్టేషన్ ఎదుట మహిళలు నిరసన చేపట్టిన నేపథ్యంలో ప్రధాన నిందితుడు వినోద్‌కుమార్ కోసం పోలీసులు వేట ప్రారంభించారు. ప్రత్యేక టీమ్ ఏర్పాటు చేసి అతడి కోసం గాలిస్తున్నట్లు రూరల్ సర్కిల్ సీఐ సత్యనారాయణ గురువారం తెలిపారు. మోసం చేసిన డబ్బుతో ఆస్తులు కొని ఉంటే ఆర్‌ఆర్ యాక్టు కింద స్వాధీనం చేసుకోవడం జరుగుతుందన్నారు. వివిధ ప్రాంతాల్లో మూడు వేల మంది దాకా బాధితులు ఉండవచ్చని సిబ్బంది చెబుతున్నారన్నారు. రూ.3 వేల చొప్పున చెల్లించి ఈ సభ్యత్వం తీసుకున్నారని, ఆ నెలలో ఎన్ని పేపర్లలో అంకెలు రాస్తే అంత డబ్బు ఇస్తామని నిర్వాహకులు చెప్పినట్లు వివరించారు. కొత్త వారిని జాయిన్ చేయిస్తే రూ.వెయ్యి నగదు ప్రోత్సాహం ఉండడంతో పోటీలు పడీ మరీ ఇందులో చేర్పించారని తెలిపారు. ఎక్కువగా మదనపల్లె పరిసర ప్రాంతాలకు చెందిన వారు బాధితులుగా ఉన్నారు. అంకెలు రాసిన ఫారాలను నిర్వాహకులు వేర్ హౌస్‌లను పంపేవారని సమాచారం.

పంజం సుకుమార్‌రెడ్డికి ప్రముఖుల నివాళి

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండల వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు, మాజీ వ్యవసాయ సలహా మండలి చైర్మన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పంజం సుకుమార్‌రెడ్డి (64) దశ దినకర్మల కార్యక్రమంలో ప్రముఖులు పాల్గొన్నారు. టీటీడీ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ రాష్ట్ర నాయకులు భూమన కరుణాకర్‌రెడ్డి, సాక్షి ఎడిటర్ ర్యాకాసి ధనుంజయరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు గురువారం పంజం చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ కుటుంబం వెంట నడుస్తూ పార్టీ పటిష్టతకు ఎంతో కృషి చేసారని వారు తెలిపారు. ఆయన లేని లోటు తీర్చలేనిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్‌రెడ్డి, రామిరెడ్డి ధ్వజారెడ్డి, పంజం సందీప్‌రెడ్డి, సాయికిషోర్‌రెడ్డి, చెవ్వుశ్రీనివాసులురెడ్డి, తోటశివసాయి, సీహెచ్‌రమేష్, మండలనాగేంద్ర, రంగారెడ్డి, నందాబాలా తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి, ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు, తదితరులు

అప్పు చెల్లించమన్నందుకు వ్యక్తిపై దాడి

నిమ్మనపల్లి : అప్పు చెల్లించమంటే వ్యక్తిపై దాడి చేసిన సంఘటన గురువారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. రెడ్డివారిపల్లె పంచాయతీ బాలేవాండ్లపల్లెకు చెందిన నాగప్ప కుమారుడు హరి(27) ఐదు నెలల కిందట తనకు మామ వరుసైన ఈశ్వరకు రూ.5 వేలు అప్పుగా ఇచ్చాడు. గురువారం అతని ఇంటి వద్దకు వెళ్లి రూ.5వేలు ఇవ్వాల్సిందిగా హరి కోరాడు. ఈ విషయమై ఇద్దరి మధ్య వాగ్వివాదం జరగడంతో ఈశ్వర, కర్రతో హరిపై దాడి చేశాడు. గాయపడిన హరినికుటుంబసభ్యులు మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్థానిక పోలీసులు విచారణ చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : కుటుంబ సమస్యలతో మహిళ ఆత్మహత్యకు ప్రయత్నించిన ఘటన గురువారం మదనపల్లె పట్టణంలో జరిగింది. చౌడేశ్వరీ నగర్‌కు చెందిన ఎం.నాగేశ్వరి(32) కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది సూపర్‌వాస్మోల్ తాగి ఆత్మహత్యకు ప్రయత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు బాధితురాలిని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వెలుగు ఏపీఎం సస్పెన్షన్

మదనపల్లె రూరల్ : మండల మహిళా సమాఖ్య(వెలుగు) ఏపీఎం సుబ్రహ్మణ్యంను సస్పెండ్ చేసినట్లు డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ తెలిపారు. మదనపల్లె మండల ఏపీఎంగా పనిచేస్తున్న సుబ్రహ్మణ్యం రూ.75 లక్షలకు సంబంధించి సీఐఎఫ్ నిధులు బయోమెట్రిక్ తీసుకోకుండా గ్రామ సమాఖ్యకు ఇచ్చాడన్నారు. దీనిపై ప్రస్తుతం విచారణ నిర్వహించాల్సి ఉందని, అప్పటివరకూ జిల్లా కేంద్రం రాయచోటి డీఆర్‌డీఏ కార్యాలయంలో విధులు నిర్వర్తించాలని ఆదేశించామన్నారు. జిల్లా కేంద్రంలో సుబ్రహ్మణ్యం రిపోర్టు చేసుకోనందున, సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చామన్నారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

పెండ్లిమర్రి : మండలంలోని నందిమండలం గ్రామానికి చెందిన పి.కాశీప్రసాద్(54) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు... బుధవారం రాత్రి ఇంటి నుంచి ద్విచక్ర వాహనంలో ప్రసాద్ కడపకు బయలుదేరాడు. యోగి వేమన యూనివర్సిటీ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో ఎద్దు, దూడ దుర్మరణం

మైలవరం : మండలంలోని తొర్రివేముల గ్రామానికి చెందిన మహిళా రైతు వెంకట సుబ్బమ్మకు చెందిన ఎద్దు, ఆవు దూడ విద్యుత్ షాక్‌తో గురువారం మృతిచెందాయి. బాధితురాలి వివరాల మేరకు.. పొలం వద్ద గడ్డి మేపుకోవడానికి సుబ్బమ్మ ఎద్దులు, ఆవుదూడలను విడిచిపెట్టింది. బోరుబావి వద్ద ఉన్న స్టార్టర్ వద్దకు వెళ్లిన ఎద్దు పొరపాటున స్టార్టర్‌కు తగలడంతో అక్కడ ఉన్న తీగలు పశువులపై పడ్డాయి. విద్యుత్తు షాక్ తగలడంతో రెండు పశువులు మృతి చెందినట్లు బాధితురాలు తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారులు పరిశీలించినట్లు తెలిపారు.

గడ్డివామి కింద పడి ఇద్దరు మృతి

ప్రమాదవశాత్తు గడ్డివామి కింద పడి ఇద్దరు మృతి

రామసముద్రం : రామసముద్రం మండలం నారిగానిపల్లి సమీపంలోని కర్ణాటక సరిహద్దులో గడ్డివామి కింద పడి ఇద్దరు మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నారిగానిపల్లికి చెందిన శ్రీరాములురెడ్డి(72), కర్ణాటక రాష్ట్రం వెళ్లి రాత్రి వస్తుండగా వర్షం ప్రారంభం కావడంతో ఆల్వేపల్లి సమీపంలో ఓ గడ్డివామి కిందకు వెళ్లి తలదాచుకున్నాడు. కర్ణాటక రాష్ట్రం చెన్నయ్యగారిపల్లికి చెందిన శంకర్రెడ్డి(55), గంగాపురానికి చెందిన రవి కూడా తలదాచుకున్నారు. అయితే ప్రమాదవశాత్తూ గడ్డివామి కుప్పకూలడంతో శ్రీరాములురెడ్డి, శంకర్రెడ్డి వామి కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. అక్కడే ఉన్న రవి ప్రమాదం నుంచి తప్పించుకుని వెళ్లి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. సంఘటన స్థలానికి చేరుకొన్న గ్రామస్తులు కూలిన గడ్డివామిని తొలగించి మృతదేహాలను బయటకు తీశారు. అనంతరం మృతదేహాలను గ్రామాలకు తరలించి పూడ్చివేశారు. వారి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.





మృతి చెందిన శ్రీరాములురెడ్డి(ఫైల్), శంకర్ రెడ్డి

తాగేందుకు డబ్బు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య

పెద్దమండ్యం : మద్యం తాగేందుకు తల్లిదండ్రులు డబ్బు ఇవ్వలేదని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని సీ.గొల్లపల్లె పంచాయతీ రెక్కలకొండపల్లెలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు..రెక్కలకొండపల్లె గ్రామానికి చెందిన అమరనాథ్‌రెడ్డి(35)కి గుర్రంకొండ మండలం సంగసముద్రం పంచాయతీ ఎల్లంవారిపల్లెకు చెందిన రెడ్డెమ్మతో వివాహమైంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. మదనపల్లెలోని తట్టివారిపల్లెలో వారు కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. తాగుడుకు బానిసైన అమరనాథ్‌రెడ్డి బుధవారం రెక్కలకొండపల్లెలోని తల్లిదండ్రుల వద్దకు వచ్చి డబ్బు అడగ్గా వారు తమ వద్ద లేవని చెప్పారు. దీంతో మద్యంలో వాస్మాయిల్ కలుపుకొని తాగాడు. బంధువులు 108వాహనంలో కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతను మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి భార్య రెడ్డెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

మదనపల్లె రూరల్ : వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో నలుగురు గాయపడి ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. చౌడేపల్లెకు చెందిన మోహన్ భార్య పార్వతమ్మ(60) తన కుమారుడితో కలిసి ద్విచక్ర వాహనంలో వస్తుండగా, బోయకొండ సమీపంలో కోతులు అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డారు. పార్వతమ్మకు గాయాలవడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. అదే విధంగా కురబలకోట మండలం మట్లివారిపల్లెకు చెందిన రెడ్డిశేఖర్(23), అతడి భార్య వాణి(20), ఏడాది వయసున్న కుమారుడు తరిగొండ లక్ష్మీనరసింహస్వామి దర్శనం చేసుకుని స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యంలోని ఎర్రమద్దివారిపల్లె వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి ముగ్గురు కిందపడి గాయపడ్డారు. నేషనల్ హైవే అంబులెన్స్‌లో ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అమూల్ డెయిరీ స్థలంలో రియల్ ఎస్టేట్ బోర్డులు

చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులు



అమూల్ డెయిరీ కనిపించకుండా బోర్డులు ఏర్పాటుచేసిన రియల్టర్

మదనపల్లె రూరల్ : కడప-బెంగళూరు హైవేలోని మదనపల్లె అమూల్ డెయిరీ స్థలంలో ఓ రియల్టర్ తన వెంచర్‌కు సంబంధించిన బోర్డులు శాశ్వతంగా ఏర్పాటుచేశాడు. ప్రభుత్వ డెయిరీకి చెందిన స్థలంలో ప్రైవేట్ వ్యక్తులు రియల్‌ఎస్టేట్ బోర్డులు ఏర్పాటుచేయడంపై సిబ్బంది తహసీల్దారు కిషోర్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదు చేసినప్పటికీ, ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో రోడ్డుపై వెళుతున్న వారు అమూల్ డెయిరీని రియల్‌ఎస్టేట్ వ్యాపారులకు అమ్మి వేసిందా అనే అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని బెంగళూరు ప్రధాన రహదారికి ఆనుకుని నక్కలదిన్నె సమీపంలోని సర్వే నెం.42/1బీ, 43/1బీలో నాలుగెకరాల భూమిని 1977లో కేంద్ర ప్రభుత్వం డెయిరీ స్కీమ్‌లో భాగంగా స్థానిక రైతుల నుంచి కొనుగోలు చేసింది. కొనుగోలు పత్రాల్లో డెయిరీ సరిహద్దుల్లో ఉత్తరం వైపు మదనపల్లె-బెంగళూరు రోడ్డు, తూర్పున ఎద్దుల బండిబాట, మిగిలిన రెండు పక్కల తుమ్మలకాలువగా పేర్కొన్నారు. స్థలం కొనుగోలు చేసిన నాటి నుంచి నేటి వరకూ ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే ఉంది. ప్రస్తుతం అమూల్ డెయిరీకి లీజు ప్రాతిపదికన ఇవ్వడం జరిగింది. డెయిరీకి ఆనుకుని పక్కన ఉన్న పొలాలను రైతుల నుంచి బెంగళూరుకు చెందిన ఓ రియల్టర్ కొనుగోలు చేశారు కేకే న్యూ సిటీ పేరుతో వెంచర్ ఏర్పాటుచేస్తున్నారు. ఇందులో జిల్లాకు చెందిన ఓ మంత్రికి, స్థానికంగా కొందరు టీడీపీ నాయకులకు వాటాలు ఉన్నాయి. భూములు కొనుగోలు చేసిన మొదట్లో స్థానిక రైతుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవడం, కోర్టు కేసులతో కొన్నాళ్లు పనులు నిలిపివేశారు. ఇటీవల మళ్లీ పనులు వేగంగా జరగడం, వెంచర్‌కు సంబంధించిన పెద్ద హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, సైన్ బోర్డులు...మెయిన్ ఎంట్రన్స్‌లో ఏర్పాటు చేయడమే కాకుండా, పక్కనే ఉన్నటువంటి అమూల్ డెయిరీకి చెందిన స్థలంలోనూ హైవే రహదారికి ఆనుకుని, భూమిలో డ్రిల్లింగ్ చేసి మరీ శాశ్వత ప్రాతిపదికన మెస్ బోర్డులు ఏర్పాటుచేశారు. దీనిపై డెయిరీ సిబ్బంది అభ్యంతరం వ్యక్తం చేస్తే వారిని బెదిరింపులకు గురిచేశారు. దీంతో వారు చేసేదిలేక, తమ స్థలాన్ని కాపాడాల్సిందిగా మండల తహసీల్దార్ కిషోర్‌కుమార్‌రెడ్డికి ఫిర్యాదుచేయడంతో పాటు ఏపీ డెయిరీ ఎండీకి లేఖ రాశారు. జిల్లా కలెక్టర్ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లారు. అమూల్ డెయిరీ స్థలంలో హోర్డింగ్‌లు ఏర్పాటుచేసుకున్న రియల్టర్, అంతటితో ఆగకుండా ఏకంగా డెయిరీ కాంపౌండ్‌కు ఆనుకుని ప్రతినెలా డెయిరీకి అద్దె చెల్లిస్తున్న క్యాంటీన్‌ను ఖాళీ చేయాలని, స్థలం తమదేనని బెదిరింపులకు పాల్పడుతున్నారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కావడంతో అధికారులు చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే...భవిష్యత్తులో డెయిరీని రియల్టర్ తమ వెంచర్‌లోదేనని చెప్పి అమ్మేస్తాడంటూ స్థానికులు మాట్లాడుకుంటున్నారు.

ఎక్సైజ్ వాహనాల వేలంలో రూ.8లక్షల ఆదాయం

మదనపల్లె రూరల్ : సారా తరలిస్తూ ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన వాహనాలకు నిర్వహించిన వేలంపాటల్లో ప్రభుత్వానికి రూ.8,77,200 ఆదాయం లభించిందని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు. మదనపల్లె ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ భీమలింగ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వాహనాల వేలం పాటలకు 52మంది ధరావతు చెల్లించి పాల్గొన్నారు. మొత్తం 67 వాహనాలకు ప్రభుత్వం రూ.7,33,600 అప్‌సెట్ ధరగా నిర్ణయిస్తే... రూ.8,77,200కు పాడుకున్నారన్నారు. జీఎస్టీ కింద రూ.1లక్ష 57వేల 896 రూపాయలు వాహనాలు వేలం పాడుకున్న వారి నుంచి వసూలు చేశామన్నారు. ఎక్సైజ్ ఎస్‌ఐ జబీవుల్లా, సిబ్బంది అలీ తదితరులు పాల్గొన్నారు.



వేలంపాటను పర్యవేక్షిస్తున్న సూపరింటెండెంట్ మధుసూదన్

గుర్రంకొండలో గంజాయి బ్యాచ్‌ల వీరంగం

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో గంజాయి బ్యాచ్‌లు వీరంగం సృష్టించాయి. పట్టణంలో రెండు బ్యాచ్‌లు పరస్పరం దాడులు చేసుకోవడంతో జనం బెంబేలెత్తిపోయారు. ఈ సంఘటన బుధవారం రాత్రి జరిగింది. బయట రాష్ట్రాల నుంచి పనులు చేసుకోవడానికి గుర్రంకొండ పట్టణానికి వచ్చిన కొంతమందితోపాటు పట్టణంలో నివాసముంటున్న మరి కొందరు కలిసి ఒక గ్యాంగ్‌గా ఏర్పడి గంజాయి సరఫరా సాగిస్తున్నారు. మూడు రోజుల కిందట ఆ గ్యాంగ్‌లో రెండు వర్గాలుగా ఏర్పడి క్రయ విక్రయాలు, డబ్బుల వసూళ్ల విషయంలో ఘర్షణకు దిగారు. వాగ్వాదం పెరగడంతో స్థానిక గంజాయి బ్యాచ్‌కు చెందిన ఒకరిని కత్తితో పొడిచి చంపేసి తన రాష్ట్రం వెళ్లిపోతానంటూ బయట రాష్ట్రాలకు చెందిన ఒకరు సవాల్ విసిరాడు. తననే చంపుతావా అంటూ స్థానిక గంజాయి బ్యాచ్ ముఠా సభ్యులు ఇందిరమ్మకాలనీలో నివాసమున్న బయట రాష్ట్రాల వారిపై దాడులకు దిగారు. ఇరువురికి రక్తగాయాలయ్యాయి. అక్కడి నుంచి పట్టణంలోని కేపీ ఫంక్షన్ హాల్ సమీపంలో కొత్తగా నిర్మిస్తున్న ఇళ్ల వద్ద మళ్లీ ఘర్షణ పడ్డారు. పట్టణంలో రాత్రిళ్లు ఇష్టానుసారం ఈ బ్యాచ్‌లు ఘర్షణలకు దిగుతూ వీరంగం సృష్టిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అంతేగాక రాత్రిళ్లు ద్విచక్ర వాహనాలపై వేగంగా వెళ్తూ.. సర్కస్ ఫీట్లకు పాల్పడుతుండడంతో ప్రజలు బయట సంచరించాలంటే హడలెత్తిపోతున్నారు. పోలీసులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఎస్‌ఐ రఘురామ్ వివరణ కోరగా ఆ సమస్య తమ దృష్టికి రాలేదన్నారు. జరిగిన సంఘటనపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చర్యలు చేపడతామన్నారు.

బాలికల వసతి గృహం తనిఖీ

మదనపల్లె రూరల్ : పట్టణంలోని బీసీ లేడీస్ హాస్టల్‌ను గురువారం సాయంత్రం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్టల్ మొత్తం కలియదిరిగి, విద్యార్థులకు అందుతున్న వసతులను, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల సమస్యలు తన దృష్టికి తేవాల్సిందిగా సూచించారు. హాస్టల్‌లో ఆర్వో ప్లాంటు లేకపోవడంతో పరిశుభ్రమైన తాగునీటిని తాగలేకపోతున్నామని, చన్నీళ్లతో స్నానం చేయడం కష్టంగా ఉందని, సోలార్ వాటర్ హీటర్స్ ఏర్పాటుచేయాలని కోరారు. హాస్టల్ కిటికీలకు మెస్ లేకపోవడంతో దోమల బెడద అధికంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థినులతో కలిసి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, సీఐ భీమలింగ భోజనం చేశారు. మధుసూదన్ మాట్లాడుతూ... జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదేశాల మేరకు...మదనపల్లె పర్యటనలో భాగంగా బీసీ హాస్టల్‌ను తనిఖీచేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ హేమావతి పాల్గొన్నారు.



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న ఎక్సైజ్ సూపరిండెంట్

అటల్ ల్యాబ్‌ల బలోపేతమే లక్ష్యం

రాయచోటి : అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల బలోపేతమే తమ లక్ష్యమని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి తెలిపారు. విజయవాడ మేరీస్ స్టెల్లా కళాశాలలో జరిగే వర్క్‌షాప్‌కు ఆయనతోపాటు రీసోర్స్ పర్సన్లు శెట్టెం ఆంజనేయులు, షర్ఫుద్దీన్, వెంకటేశ్వర్లు, హేమంత్‌కుమార్, మనోహర్ హాజరయ్యారు. ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ పర్సన్స్‌కు శిక్షణ కార్యక్రమంలో డిజైన్ థింకింగ్, ఏఐ టూల్స్, ఎలక్ట్రానిక్స్, రాస్బు బెర్రీపై, సోలార్ పవర్ రోబోటిక్స్ కోడింగ్, అటల్ డాష్‌బోర్డు అంశాలపై శిక్షణ ఇస్తున్నారని తెలిపారు. శిక్షణ అనంతరం అటల్ ల్యాబ్‌లలో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి మార్గదర్శకత్వం వహించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.



శిక్షణకు హాజరైన రీసోర్స్ పర్సన్లు

ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్ ప్రారంభం



చెన్నకేశవ (5 వికెట్లు)



కిరణ్‌కుమార్ (5 వికెట్లు)



అనెల్ లియో (83 పరుగులు)

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లు గురువారం ప్రారంభమయ్యాయి. కడప వైఎస్సార్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో తొలి రోజున కడప-కర్నూలు జట్లు తలపడ్డాయి. టాస్ గెలుచుకున్న కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 65.3 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌట్ అయింది. ఆ జట్టులోని రుత్విక్ కల్యాణ్ 40 పరుగులు, రోహిత్ గౌడ్ 35 పరుగులు చేశారు. కడప జట్టులోని చెన్నకేశవ అద్భుతంగా చక్కటి లైనప్‌తో బౌలింగ్ చేసి ఐదు వికెట్లు తీశాడు. అదే విధంగా జయప్రణవ శాస్త్రి 2, క్యాశపరెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 24 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 54 పరుగులు చేసింది. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

కెఓఆర్‌ఎం క్రికెట్ మైదానంలో..

కెఓఆర్‌ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో నెల్లూరు-అనంతపురం జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన నెల్లూరు జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 59.5 ఓవర్లకు 224 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని అలెన్ లియో 61 పరుగులు, సుశాంత్ 42 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని టి.కిరణ్‌కుమార్ అద్భుతంగా బౌలింగ్ చేసి ఐదు వికెట్లు తీశారు. సంజయ్ 2, దేవాన్ష్ 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 34 ఓవర్లకు 6 వికెట్లు కోల్పోయి 93 పరుగులు చేసింది. ఆ జట్టులోని సాత్విక్ 23 పరుగులు చేశాడు దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

బోగాథమ్మ ఆలయంలో చోరీ

కమలాపురం : మండలంలోని పందిళ్లపల్లె శివారులో ఇటీవల పునర్నిర్మించిన బోగాథమ్మ ఆలయంలో గుర్తుతెలియని దుండగులు బుధవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఆలయం తాళం పగులగొట్టి హుండీని రంపంతో కోసి అందులో నగదు చోరీ చేశారు. ఆలయం బయట పడేశారు. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని గ్రామస్తులు తెలిపారు.

రుణదాతల ఒత్తిడి..ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె రూరల్ : రుణదాతల ఒత్తిడి భరించలేక ఇద్దరు వ్యక్తులు వేర్వేరు ఘటనల్లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి గురువారం ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మండలంలోని పెంచుపాడు పంచాయతీ పాశంవారిపల్లెకు చెందిన వెంకటరమణ కుమారుడు కే.సురేష్(34) ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. స్థానికుడు జయన్న వద్ద రూ.2 లక్షలు కుటుంబ అవసరాల కోసం అప్పు తీసుకున్నాడు. 100కి రూ.25 వడ్డీతో కొంత కాలం చెల్లించాడు. ఇదే క్రమంలో జయన్న మరికొంత నగదు సురేష్ పూచీకత్తుతో మరింతమందికి వారం, నెల కంతులకు ఇచ్చాడు. వారు తిరిగి చెల్లించక పోవడంతో ఆ డబ్బుతో కలిపి మొత్తంగా రూ.10 లక్షలు బాకీ ఉందని తక్షణమే చెల్లించాలని సురేష్‌పై అప్పిచ్చిన జయన్న ఒత్తిడి చేశాడు. దీంతో సురేష్ తన ఇంటిలోని ఆవులు అమ్మి రూ.లక్ష, వరి పంట దిగుబడి, తన ఆటో విక్రయించి రూ.1.5 లక్షలు విడతల వారీగా చెల్లించాడు. జీవనాధారం లేక కూలి పనులకు వెళుతున్నాడు. అయినా అప్పు చెల్లించాలని ఒత్తిడి చేయడంతో భరించలేక కుటుంబాన్ని వదలి ఉపాధి కోసం బెంగళూరుకు వెళ్లిపోయాడు. అయితే జయన్న తాలూకా పోలీసులను ఆశ్రయించి సురేష్‌పై ఫిర్యాదు చేశాడు. పోలీసులు అతడి కుటుంబ సభ్యులను విచారించి, సురేష్‌ను రప్పించాలని కోరడంతో బుధవారం రాత్రి ఇంటికి వచ్చాడు. అప్పు చెల్లించాలన్న ఒత్తిడి భరించలేక, వలసపల్లె పంచాయతీ బోయకొండ క్రాస్ వద్ద పురుగుమందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. అదేవిధంగా పట్టణంలోని వాల్మీకివీధికి చెందిన నరసింహులు కుమారుడు బాబు(55) స్థానికంగా అల్ల నేరేడు మండీ నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో వ్యాపార అవసరాల కోసం నాలుగేళ్ల క్రితం స్థానికులైన జయమ్మ, అరుణ వద్ద రూ.7లక్షలు అప్పు తీసుకున్నాడు. అప్పు చెల్లింపులో భాగంగా ఇప్పటివరకూ దాదాపు రూ.12.5 లక్షలు తిరిగి చెల్లించాడు. అయితే ఇప్పటికీ రూ.7లక్షలు అసలుతో పాటు వడ్డీ చెల్లించాలని రుణదాతలు కొద్దిరోజులుగా తీవ్రంగా ఒత్తిడి చేశారు. ఇదే క్రమంలో గురువారం సాయంత్రం అల్లనేరేడు మండీ వద్దకు జయమ్మ, అరుణ, ఆమె భర్త మోక్షిత్‌రెడ్డి వెళ్లి అప్పు చెల్లించాలని నిలదీశారు. గొడవ చేశారు. దీన్ని అవమానంగా భావించిన బాబు పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయా ఘటనల్లో బాధితులను కుటుంబసభ్యులు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్స అనంతరం బాబు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు.





ఆత్మహత్యకు పాల్పడిన సురేష్, మండీ యజమాని బాబు